మొగపిల్లల తండ్రులు ముఖాలు చిట్లించారు. అభ్యుదయ వాదులు లీల ధైర్య సాహసాలకు మెచ్చుకున్నారు. ఆడదాన్ని బానిసగాచూచే అభివృద్ధినిరోధకులకు లీల ప్రవర్తన మింగుడు పడలేదు.

(చిత్రిక 8-15 మార్చి)

# 15. ప్రజా సేవయే మా కర్తవ్యం

అది పనిచేసే ప్రభుత్వం ఏలుబడిలో ఉన్న రాజ్యంలోని ప్రభుత్వ సంస్థ. పేరు ఆర్. టి. సి. "ప్రజా సేవయే మా కర్తవ్యం" అన్న నినాదంతో నిర్విరామంగా ప్రజాసేవ కంకితమైన సంస్థ అది. ఒకే సంవత్సరంలో మూడుసార్లు ప్రయాణీకుల టికెట్ల ధర పెంచడంకూడా వాళ్ల ప్రజాసేవలో ఒక భాగమే. అట్టి ప్రజాసేవ కంకితమైన సంస్థ వారి బస్సు దాదాపు 250 కి. మీ. దూరంలోనున్న ఒక పట్టణం నుండి రాజధానికి బయలుదేరింది. క్రిక్కిరిసిన జనంతో పురుటి నొప్పులతో బాధపడ్తున్న స్త్రీలా ఆపసోపాలు పడ్తూ ఆ బస్సు నడుస్తూంది.

ప్రజాసేవయే ధ్యేయంగా భావించిన కండక్టర్ ప్రజలకు సహాయముచేయటానికై దగ్గర స్టేషన్లకున్న 3 రూ॥ల టిక్కెట్టుకు బదులు 2-50 పై. టిక్కెట్టు తీసుకొని టికెటు చించకుండా డబ్బులు జేబులో వేసుకుంటున్నాడు. అది

ఎక్స్‌ప్రెస్ బస్సయినా జగన్నాథ రథంలా ఊగుతూ సాగుతుంది. టికెట్టు వెనుక వ్రాసిన డబ్బుకై దిగిపోయేటప్పుడడిగిన ప్రయాణీకులవైపు చిరాకుతో కూడిన చూపుచూసి కొందరికి ఇస్తున్నాడు- కొందరిని గదమాయిస్తున్నాడు. ఊపిరి సలుపని జనం త్రొక్కిడితో, ఉక్కతో, చెమటకంపుతో నరకాన్ని తలపింపజేస్తూ ప్రయాణిస్తున్న ఆ బస్సులో గుప్పుమని పొగ రాసాగింది. బస్సుకు నిప్పంటుకుందని భావించిన జనం డ్రైవర్ సీటువైపు చూసి నిశ్చేష్టులయ్యారు. తనముందున్న "పొగ త్రాగరాదు" అన్న వాక్యాన్ని అపహాస్యం పాలు చేయడానికన్నట్లుగా ఒక చేత్తో స్టిరింగ్ పట్టుకొని వేరొకచేత్తో ఘంటుచుట్టదమ్ములాగుతున్నాడు డ్రైవర్. అసలే ఊపిరి ఆడక ఛస్తున్న ప్రయాణీకులకు ఆ చుట్ట కంపు మరీ భరింపరానిదై ప్రత్యక్ష నరకాన్ని తలపింపజేస్తున్నది. ప్రయాణీకుల్లో ఒకరు "డ్రైవర్‌సాబ్, చుట్ట బంద్‌చెయ్" అని అరిచాడు. డ్రైవర్ ఒకసారి అతనివైపు నిర్లక్ష్యంగా చూసి ప్రజా సేవయే తన కర్తవ్యంగా భావించాడు కాబట్టి "మీ యిష్టముంతే తాగుండ్రి, నన్నెందుకు బందుచెయ్యమంటురు" అని వాళ్ళకుకూడా కన్సెషన్ పారేశాడు. ప్రయాణీకులు చేసేదేంలేక ఆ నరకాన్ని భరిస్తూ ప్రయాణం చేస్తున్నారు.

ఇంతలో ఒక ఊరు వచ్చింది. అది ఎక్స్‌ప్రెస్ స్టేజి కాదు. అయినా బస్సక్కడ ఆగింది. అప్పటికే రెండుగంటల లేటుతో సగందూరమైనా చేరుకొని బస్సుస్టేజిలేకున్నా అక్క

డెందుకాగిందో జనాని కర్థంకాలేదు. డ్రైవర్, కండక్టర్ హుందాగాదిగి దగ్గర్లోనున్న తాటిచెట్లవైపు నడకసాగించారు. ఇంతలో కొందరు ప్రయాణీకులుదిగి కండక్టర్‌ను సమీపించి "కండక్టర్‌సాబ్, ఇప్పటికే రెండు గంటలు ఆలస్యమైంది. ఇక్కడెందుకాపారు?" అనడిగారు. బ్యూరోక్రసీ నరనరాన జీర్ణించుకున్న కండక్టరు వాళ్ళమాటల కేమాత్రం చలించక చిద్విలాసంగా నవ్వి "రెండు గంటలు లేటయినందుకే వాగుతున్నవ్ అంతర్జెంటు పనుంటే స్వంతకారులోపోవాలి- ఆగాగు ఇప్పుడే వస్తా"నని వాళ్ళను గదమాయించి నడకసాగించాడు అరగంటసేపు సురాపానం సేవించి తిరిగి డ్రైవర్, కండక్టర్ బస్సెక్కారు. బస్సుపైనున్న "ప్రజాసేవయే మా కర్తవ్యం" అన్న అక్షరాలు కొట్టొచ్చినట్టుగా ఉండి ప్రజల్ని వెక్కిరిస్తున్నాయి. స్టేజీలు వస్తూ పోతున్నవి. ఒక స్టేజిలో ఆగిన బస్సు ససేమిరా కదలనంటున్నది. ఇంతలో కండక్టరు బస్సు దిగి 'మగాళ్ళందరూ దిగి బస్సు నెట్టండి' అన్నాడు. చేసేదేంలేక వాళ్ళంతా దిగి అరఫర్లాంగువరకు నెట్టగా స్టార్టయింది. ప్రజాసేవయే కర్తవ్యంగా ఎంచాడు కాబట్టి కండక్టర్ ఆడవాళ్ళతో నెట్టించలేదు. 250 కి.మీ. పోయే బస్సు ఆడవారితో నెట్టించకుండ స్టార్టయినందుకు ఆర్. టి. సి. వారి ప్రజాసేవను వేనోళ్ళ పొగడాల్సిందే.

బస్సు బొజ్జ రాజకీయ నాయకుడిలా సాగిపోతుంది. రాజధానినగరం యింకా 1.0 కి. మీ. దూరంలో ఉంది. ఇం

కొక అరగంటలో గమ్యం చేరుకుంటామని సంబరపడుతున్న ప్రయాణీకులకు ఆశాభంగమే జరిగింది. బస్సెందుకో సడన్ గా ఆగింది. అది పల్లెటూరి బయటి ప్రదేశం. అక్కడ ఏబస్సు ఆగదు. ప్రయాణికులంతా క్రిందకు దిగారు. డ్రైవర్ బస్ చెక్ చేసి డిజిల్ అయిపోయిందన్నాడు. జనాని కేంచేయాలో తోచలేదు. ఎంతో అర్జంటు పనిమీదపోయే వాళ్లు రకరకాల ప్రయాణికులు ఆ బస్సులో ఉన్నారు. వేరే బస్సులో పోదా మన్నా అక్కడేబస్సూ ఆగదు. ఆడవాళ్ళతో, పిల్లలతో, లగే జితో లారీతో పోవడం కష్టం. ఇంతలో కండక్టరుకు ఒక చాకు లాంటి ఐడియా వచ్చింది. ప్రయాణీకులతో ఈ బయటి ప్రదేశంలో బస్సులాగవు. మీరందరు మనిషికొక రూపా యిస్తే డ్రైవర్ లారీలో పట్నంపోయి డీజిల్ తెస్తాడు లేదా యిక్కడ బాధపడాల్సిందే. ఆలోచించండి" అన్నాడు ప్రజా సేవనే కర్తవ్యముగా భావించిన కండక్టర్ తన ప్రయాణీకుల కష్టాలు తీర్చుటకై ఒక్క రూపాయితో అవకాశం కలిగిం చాడు. వారు వెంటనే మనిషికొక రూపాయి జమచేసి కం డక్టర్ కిచ్చారు. డ్రైవర్ లారీనాపి పట్నంపోయి డీసిల్ తెచ్చి నాలుగుగంటల లేటుతో ఎలాగోలా బస్సు రాజధాని నగరం చేరింది. బ్రతుకుజీవుడా అని ప్రయాణికులంతా దిగారు. ఈ తతంగమంతా చూస్తూ అదే బస్సులో ప్రయా ణము చేస్తున్న యువకుడొకడు జరిగిన సంఘటనలన్నీ వివ రిస్తు ఆర్టీసి అధికారులకొక కంప్లయింటు వ్రాసి యిచ్చాడు.

—కాలువ మల్లయ్య

కాగితాన్ని పరిశీలించిన అధికారి దానిపై చర్య తీసుకుంటా నని ఆ యువకునికి హామీ యిచ్చాడు. యువకుడు ఆ భవ నంనుండి బయటకు వచ్చాడో లేదో ఆ కాగితం అన్ని కంప్లె యింట్లువలెనే చెత్తకుండీ పాలయింది. ఆ భవనం గోడపై వ్రాసియున్న "ప్రజాసేవయే మా కర్తవ్యం" అన్న అక్షరాలు అక్కడికి వస్తుపోతున్న ప్రయాణికులను చూస్తు వెక్కిరిస్తు న్నట్టుగా చిద్విలాసంగా నవ్వుతున్నాయి

(మనుగడ- మే 83 లో ముద్రితము)

# 16. కృష్ణయ్య ప్రేమ పెళ్ళి

రుక్మిణీ కల్యాణం భాగవతం చూసిన కృష్ణయ్యకు నిజం గానే కనువిప్పు కలిగింది. రుక్మిణి కృష్ణునికి లేఖ పంపగా అతడుపోయి ఆమెను తీసికొని వచ్చి పెళ్ళి చేసుకోవడమంతా అతని మస్తిష్కంలో మెదలసాగింది. తానెందుకు వెనుకాడు తున్నట్లు? తనకు వివాహం కాలేదు. రామయ్య మామ కూతురు రుక్కమ్మకుగూడ వివాహం కాలేదు. తానామెను ప్రేమించాడు; ఆమె తనను ప్రేమించింది. అందులో ఒకే కులంవాళ్ళు. వరుసకూడ బాగా కుదిరింది. అటువంటపుడు మనువాడుటకు భయపడటమెందుకు? సంఘానికా? ఇందు లో తాను చేసే తప్పేముంది? పెళ్ళికాకముందే అక్రమంగా ప్రవర్తించలేదు. ఇద్దరు ప్రేమించుకున్నాక పెద్దలెందుకు



కట్నం కథలు